పత్రికా ప్రకటన కాకినాడ, 08.11.2020

గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ప్రత్యేకంగా దృష్టిసారించారని, ఈ పథకం ద్వారా పేదలకు అత్యున్నత వైద్యం అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ డి.మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యమిత్ర, టీం లీడర్ ఉద్యోగ నియామకాలకు శనివారం జేఎన్‌టీయూలో కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహించగా, ఆదివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) కీర్తి చేకూరితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యర్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. వీవీఐపీలకు ఎలాంటి వైద్యం అందుతుందో అలాంటి వైద్యాన్ని పేదలకు ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల్లో అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో గతంతో పోల్చితే ఇకపై ఆరోగ్యమిత్రల సేవలు కీలకం కానున్నాయని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల్లో ప్రత్యేక వసతులతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, హెల్ప్ డెస్క్ వ్యవస్థను పటిష్టం చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన వారిని చిరునవ్వుతో పలకరించి, మంచిగా మాట్లాడి కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన బాధ్యత ఆరోగ్యమిత్రలకు ఉంటుందన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల బాగోగుల గురించి వారి కుటుంబ సభ్యులు అడిగితే సరైన సమాచారం ఇస్తే వారెంతో ఆనందిస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి గ్రామస్థాయిలో సరైన అవగాహన లేక చాలా మంది ప్రజలు మోసపోతున్నారన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ఆరోగ్యమిత్రలు, టీం లీడర్లు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు సోమవారం నియామక ఉత్తర్వులు అందిస్తామని, తర్వాత శిక్షణ ఉంటుందని తెలిపారు. నియామక ప్రక్రియలో అకడమిక్ మెరిట్‌కు 65 శాతం, కంప్యూటర్ నైపుణ్యాలకు 15 శాతం, మౌఖిక పరీక్షకు 20 శాతం వెయిటేజీ ఇచ్చినట్లు డీఎంహెచ్‌వో డా. కేవీఎస్ గౌరీశ్వరరావు తెలిపారు. కలెక్టర్ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఎం.రాఘవేంద్రరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డా. పి.రాధాకృష్ణ, జిల్లా మేనేజర్ డి.రాంబాబు తదితరులు ఉన్నారు.

(సమాచార శాఖచే జారీ)